క్లుప్తంగా

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు నగదు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి గురువారం షాద్‌నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంచిరేవుల అశోక్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విరాళానికి సంబంధించిన నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ప్రియాంక, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, కరుణాకర్, రాజుగౌడ్, నెహ్రూ నాయక్, సురేశ్, తుప్పరి గణేశ్, జాకారం శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో నాభిశిల(బొడ్రాయి), మైసమ్మ దేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. గ్రామదేవతలను పూజిస్తే ఆ గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీజేపీ నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

పశువైద్యురాలు స్ఫూర్తి



దూడకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యురాలు

కొత్తూరు: పశువుల పెంపకంలో కాపరులు, రైతులు పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆవులు, గేదెలకు చుడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఆవులు, గేదెలు, దూడల్లో తరచూ వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులు అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు చేయించాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతుండడంతో పశుపోషణ, వాటి నిర్వాహణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యుడు శేఖర్, సిబ్బంది రాజ్, శ్రీలత, కృష్ణ, రవి, రాజు, బుచ్చిలింగం, పాడిరైతులు, పాల్గొన్నారు.

భవిష్యత్ నిర్మాణంలో ఆవిష్కరణలు కీలకం

మొయినాబాద్: ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ) రంగంలో భవిష్యత్‌ను రూపొందించడంలో సాంకేతికత, ఆవిష్కరణలు ఎంతో కీలకమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ సైన్స్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏఐ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు దీనిపై స్థిరమైన అభ్యాసం, నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 800 మంది పాల్గొని పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, డిజైన్ ఏ థాన్, కోడ్ ఏ థాన్, సాంకేతిక సెషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిరామ్ బొమ్మరాజు, సీఎస్ఐ హెడ్ చైర్మన్ సి.సుధాకర్, సీఎస్ఐ ప్రతినిధి రాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజా, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీలత, సీనియర్ ఏఓ వెంకటాచలం, ఈవెంట్ కన్వీనర్ అరుణాకుమారి, హెచ్ఓడీలు, విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం 4.10లక్షల మొక్కలు

- మండలంలోని 41 నర్సరీల్లో మొక్కల పెంపకం
- ఒక్కో జీపీలో 10వేలు నాటడమే లక్ష్యం
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు



ఏట్లఎర్రవల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, ఏపీఓ వీరాసింగ్

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచుతున్నారు. జూన్ నెలవరకు 4.10లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ నర్సరీలో 10 వేలకు తగ్గకుండా మొక్కలను పెంచి వర్షాకాలం నాటికి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలను వేసవిలో ఎండిపోకుండా గ్రీన్ నెట్‌లతో ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలతో నీటిని పోయిస్తూ సంరక్షిస్తున్నారు.

లక్ష్యం మేరకు పెంపకం..

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో నర్సరీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి 10వేల మొక్కలు చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 4లక్షల 10వేల మొక్కలు నాటే విధంగా కృషి చేస్తున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో, రోడ్లకు ఇరువైపులా, రైతులకు ఉపయోగపడే విధంగా అన్ని రకాల మొక్కలు నాటించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడూ జిల్లాస్థాయి అధికారులతో పాటు ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, పరిశీలిస్తున్నారు. ఉపాధి హామీ కూలీలతో నిత్యం పనులు చేయిస్తూ మొక్కల సంరక్షణకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వివిధ రకాల మొక్కలు

ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, కర్జురా, బాదం, వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, మల్లె, మందరం పూల మొక్కలను పెంచుతున్నారు. గతంలో పోల్చితే ప్రజలు ఇష్టపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు..



ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీలో మొక్కల పెంపకం పనులు చురుకుగా సాగుతున్నాయి. మండలంలో వన మహోత్సవం కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీలను నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నాం. – అపర్ణ, ఎంపీడీఓ

అవసరమైన మొక్కలు పెంచుతున్నాం



మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో నర్సరీలు ఉన్నాయి. అందులో ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచుతున్నాం. అన్ని నర్సరీలలో కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం వచ్చేసరికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తాం. – వీరాసింగ్, ఏపీఓ

రిజర్వాయర్ నిర్మాణంపై నిర్లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, తట్టెడు మట్టిని కూడా తీయలేదని విమర్శించారు. పదేళ్లు అధికారం అనుభవించిన కేసీఆర్ కుర్చీ వేసుకొని రిజర్వాయర్ నిర్మిస్తానని హామీ ఇచ్చి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రిజర్వాయర్ నిర్మాణం కాకుండా చేసింది మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ లేనని ఆరోపించారు. రిజర్వాయర్ నిర్మించకపోతే ఓట్లు అడగమని చెప్పిన అంజయ్యయాదవ్, నాటి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఈ ప్రాంత ప్రజలు ఎన్నికల్లో ఓడించారన్నారు. గత పాలకులు సొంత లాభం కోసం ప్రాజెక్టుల డీపీఆర్ మార్చారే తప్పా ఈ ప్రాంతానికి ఏ ప్రయోజనం చేయలేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల అంశంపై రోజుకో మాట మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అసత్య ప్రచారాలను చేస్తున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఆ పార్టీ నేతలు చేస్తున్న కల్లిబొల్లి మాటలను ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జంగ నర్సింహ, వెంకట్‌రాంరెడ్డి, శివశంకర్‌గౌడ్, ప్రియాంక, దామోదర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి హత్య ఎంతో బాధాకరం

కేశంపేటకు చెందిన విద్యార్థి గంప ప్రవీణ్ అమెరికాలో దుండగుల కాల్పుల్లో హత్యకు గురికావడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లిన విద్యార్థి హత్యకు గురికావడం తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

ప్రశాంతంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు



కేశంపేట: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

షాద్‌నగర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమ్మదనంలోని గురుకుల కళాశాల, మొగిలిగిద్దలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ, విశ్వభారతీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2040 మందికిగాను 1949 మంది విద్యార్థులు హాజరయ్యారు. 91 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు కస్టోడియన్ శ్రీకాంత్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు 144వ సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

24 మంది గైర్హాజరు..

శంకర్‌పల్లి: ఇంటర్ సెకండియర్ పరీక్షలకు పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 996మంది(ఇంటర్, ఒకేషనల్) విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 972 మంది(97.6శాతం) హాజరయ్యారు. 24మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ వసంత తెలిపారు.

7 మంది గైర్హాజరు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు కేజీబీవీ పాటిగడ్డ, కొత్తూర్ మండలంలోని దర్గా వద్ద ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల విద్యార్థులు మొత్తం 167 మందికిగాను 160 మంది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

'దండోరా'ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మద్దిలేటి మాదిగ

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలని, మంత్రి వర్గంలో మాదిగలకు 2 స్థానాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మద్దిలేటి మాదిగ అన్నారు. చేవెళ్లలో గురువారం నియోజకవర్గ ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల నాయకులతో చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న చేవెళ్లలో జిల్లా మాదిగ దండోరా మహా ప్రదర్శన నిర్వహించనున్నామని, మాదిగలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. మాదిగలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు కేటాయించటంలో కమిషన్ వివక్షత చూపించినట్లుగా ఉందన్నారు. అత్యధిక జనాభా కలిగి ఉన్న మాదిగలకు 9శాతం రిజర్వేషన్లు కేటాయించటం అన్యాయమని ఆరోపించారు. జనాభా ప్రతిపాదికన చూస్తే 12శాతం రావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్, శంకర్‌రావు, ప్రవీణ్, శివశంకర్, భానుప్రసాద్, రాజు, నరేశ్, రాములు, ప్రసాద్, మల్లేశ్, మహేందర్, విజయ్, కుమార్, అనంతరాములు, రమేశ్ తదితరులు ఉన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో గురువారం ఆంజనేయస్వామి, వినాయకుడు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించడంతో పాటు నిత్యం దూపదీప నైవేద్యాలు సమర్పించాలని సూచించారు. ఆయన దేవాలయ నిర్మాణానికి, విగ్రహాల ప్రతిష్ఠ నిమిత్తం రూ.4లక్షల నగదును విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహ, జేకే నర్సింహ, జెట్ట కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కాట్న లతశ్రీశైలం, కాట్న మాధవిరవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో గ్రామస్తులతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఇంటి పన్నులు వెంటనే చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వెంటనే ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు రూ.1కోటి వరకు పన్నులు వసూలయ్యాయని, ఇంకా రూ.2కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని చెప్పారు. మార్చి 31వరకు పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. మున్సిపాలిటీ ప్రజలు సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు.

'తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'

మొయినాబాద్: రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం శుభపరిణామమన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. తెలంగాణలో మేధావులంతా బీజేపీవైపు చూస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన పట్టభద్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీల విజయంపై హర్షం

చేవెళ్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుపై పార్టీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చేవెళ్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్,నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయాన్ని కైవసం చేసుకున్న బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉమ్మడి మెదక్, నిజామబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపొందిన మల్క కొమురయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ పార్టీయేనని ఈ తీర్పులు సంకేతాలు అందించినట్లేనని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ చైతన్య, మాస్టర్ మైండ్ పాఠశాల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఈ రెండు పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నప్పటికీ విద్యార్థులను చేర్చుకొని పాఠశాలలు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ పాఠశాలలకు సరైన బిల్డింగ్స్, మైదానాలు, ఫైర్ సేఫ్టీ, క్వాలిఫైడ్ టీచర్లు సైతం లేరన్నారు. ఈ పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో గల స్వయంభూ లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ధ్వజారోహణం, స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిపించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, జమాల్‌ఖాన్, కృష్ణయ్య, రూప్లానాయక్, యాదగిరిరావు, రాఘవేందర్‌రావు, అంజయ్య, ద్రోణాచారి, అఖిల్, అనువంశిక ధర్మకర్త నర్సింహాశర్మ, వెంకటయ్య, బాబు పాల్గొన్నారు.

మాలల అస్తిత్వానికి పోరాడుదాం



మాట్లాడుతున్న జిల్లా జేఏసీ సభ్యులు

చేవెళ్ల: మాలల అస్తిత్వం కోసం అందరూ ఏకమై ఐక్యతతో కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాల సంఘాల జిల్లా జేఏసీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాల సంఘాల జిల్లా జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలలపై జరుగుతున్న కుట్రలను, ఉనికి, వర్గీకరణ ముసుగులో మాలలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాలలను ద్రోహులుగా, దోషులుగా చిత్రీకరించటం సరికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాటాల ద్వారా వచ్చిన రిజర్వేషన్ల అవకాశాలను అందిపుచ్చుకోవటమే తప్పు చేసినట్లుగా సమాజానికి చెప్పటం దురదృష్టకరమన్నారు. మాలల అస్థిత్వం కోసం మాలల్లోని మేధావులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు విద్యార్థులు మేల్కొని ముందుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎర్పుల మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్, అలిండియా అంబేడ్కర్ సంఘం నాయకులు ఎం.శ్రీనివాస్, సత్యం, మహేశ్, సంజీవ ఉన్నారు.

కలుపుమందు పిచికారీతో పంట నష్టం

- పరిహారం చెల్లించాలంటున్న రైతు
- పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శిరీష

కేశంపేట: పంటలో వచ్చిన కలుపును తొలగించుకునేందుకు రైతు ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేసిన మందును చేనులో పిచికారీ చేశాడు. కలుపు తొలగడం ఏమో కానీ ఉన్న పంట ఎండిపోయింది. మండల పరిధిలోని అల్వాల గ్రామంలో రైతు శ్రీధర్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో ఐదెకరాల వరకు మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటలో కలుపు నివారణ కోసం కేశంపేట గ్రామంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని సంప్రదించాడు. అక్కడ ఉన్న సిబ్బందికి మొక్కజొన్న విత్తనాలను నాటి 30 రోజుల దాటిందని, కలుపు ఉందని రైతు తెలిపాడు. గ్రోమోర్ కేంద్రం సిబ్బంది రైతుకు అట్రిజన్ స్ప్రే మందును ఇచ్చి ఎలా వాడాలో తెలిపాడు. అతడు చెప్పిన విధంగా పంటపైన స్ప్రే చేసిన తర్వాత మొక్కజొన్న పంట ఎండిపోతున్నట్టు గుర్తించిన రైతు మళ్లీ గ్రోమోర్ కేంద్రాన్ని సంప్రదించాడు. వారు కంపెనీ వారికి సమాచారం ఇవ్వడంతో పంటను పరిశీలించి వెళ్లారు. స్ప్రే మందు వికటించి పంట ఎండిపోయిందని, వేరే పంటను వేసుకోవాలని అట్రిజన్ కంపెనీ ప్రతినిధి తెలిపినట్టు రైతు ఆరోపించారు. తనకు ఆ పంట సాగు ఎకరానికి రూ.50వేల వరకు ఖర్చు అయినట్టు రైతు తెలిపాడు. గురువారం మండల వ్యవసాయ అధికారి శిరీష ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సుధ, రైతు పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



పట్టుపడిన ద్విచక్రవాహనాలు

ఎస్ఐ సంతోష్‌రెడ్డి

చేవెళ్ల: నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై మూడుసార్లు పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేసి ఆర్టీఓకు అప్పగిస్తామని ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో గురువారం సివిల్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని, ఇర్రెగ్యూలర్ నెంబర్ ప్లేట్ ఉన్న ద్విచక్రవాహనాలు 20, రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనాలు 09, ట్రిపుల్ రైడింగ్ చేసిన 03 వాహనాలను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ వాయిలెషన్స్‌కి పాల్పడుతున్నట్లుగా 32 వాహనాలకు ట్రాఫిక్ చలాన్లు విధించి విడిచిపెట్టినట్లు తెలిపారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.